# ఎడ్వర్‌టైజింగ్ కథలు

*

# విజయ సూత్రాలు

ఎ.జి.కృష్ణమూర్తి

ఎమెస్కో

## విషయసూచిక


| | | |
|---|---|---|
| | ముందుమాట | 9 |
| | ఉపోద్ఘాతం | 11 |
| | I విఠల్ | 17 |
| | II విక్రమ్ | 24 |
| | III విఠల్ ఫాంహౌస్ | 20 |
| 1. | సూత్రం-1<br>**కామన్ సెన్స్** | **29** |
| 2. | సూత్రం-2<br>**వినియోగదారుడిలాగే ఆలోచించు** | **41** |
| 3. | సూత్రం-3<br>**ప్రతి ప్రకటన కష్టపడి పనిచేయాలి** | **51** |
| 4. | సూత్రం-4<br>**సినిమాలు చూడు!** | **59** |
| 5. | సూత్రం-5<br>**వినియోగదారుల అసంతృప్తిని అధ్యయనం చేయి** | **67** |
| 6. | సూత్రం-6<br>**ఉత్కృష్టమైన వాటితో పోల్చుకో** | **75** |
| 7. | సూత్రం-7<br>**బాధ్యతలున్న సృజనాత్మకత!** | **81** |
| 8. | సూత్రం-8<br>**ప్రొడక్ట్ ఎల్లలు దాటకు!** | **87** |

9. సూత్రం–9

**గుర్తింపు, దాని కొనసాగింపు బ్రాండ్‌కి మూల స్తంభాలు 95**

10. సూత్రం–10

**అంతర్వాణిని నిర్లక్ష్యంచేయకు 103**

11. సూత్రం–11

**యాడ్ మేన్ అంటే... 111**

12. సూత్రం–12

**నేటి అత్యవసరం విషయ విజ్ఞానమే 119**

13. సూత్రం–13

**మనలాగే జీవం ఉన్నవి బ్రాండ్స్... జాగ్రత్త సుమా! 127**

14. సూత్రం–14

**ప్రకటనల ప్రతిఫలాలు మార్కెట్‌లో దక్కాలి, అవార్డులతో కాదు 135**

15. సూత్రం–15

**బ్రాండ్‌తో చేయికలుపు–ఇకచూడు... 141**

16. సూత్రం–16

**ఎడ్వర్‌టైజింగ్ నలుగురు కలసి ఆడే ఆట.**
**విజయాలను పంచు 149**

17. సూత్రం–17

**వినియోగదారుడే రారాజు 155**

18. సూత్రం–18

**కొత్త క్లయింట్స్‌ను ఆహ్వానించండి 163**

19. సూత్రం–19

**ప్రతి అద్భుతమైన ప్రకటన వెనుక ఒక క్లయింట్ ఉంటాడు 171**

**తుది పలుకు 177**

**రచయిత గురించి 179**

# I

# విఠల్

విఠల్...

విక్రమ్...

గురువు విఠల్.

శిష్యుడు విక్రమ్.

వీరిద్దరూ మన జీవితాల్లో ప్రవేశించి పలు ముచ్చట్లు చెబుతారు రాబోయే అధ్యాయాల్లో. మార్కెటింగ్ గురించి, ఎడ్వర్‌టైజింగ్ గురించి.

ముందుగా వీరిని పరిచయం చేసుకుందాం.

విఠల్... ఇప్పుడే ఏభైయవ పడిలో అడుగుపెట్టాడు.

సన్నగా రివటలా ఉంటాడు.

కొంచెం పొడుగే. ఐదడుగుల పదంగుళాలుంటాడు.

గత ఇరవై ఐదేళ్ళుగా మార్కెటింగ్, ఎడ్వర్‌టైజింగ్ రంగాలలో పనిచేస్తున్నాడు. చెప్పుకోదగ్గ విజయాలనే సాధించాడు. ముఖ్యంగా విమల్, రస్న, ధారాలాంటి దేశీయ బ్రాండ్స్‌తో కలసి పనిచేసి ఆ బ్రాండ్స్ ఉన్నతికి సహాయపడ్డాడు. వాటి విజయాలతో పాటు, తనూ ఒక చిన్న సైజ్ విజేతయ్యాడు.

ముక్కుసూటి మనిషి.

ఎవరైనా ఏదైనా సలహా అడిగితే, నిజం చెప్పమంటారా, అబద్ధం చెప్పమంటారా అని ఎదురు ప్రశ్న వేస్తాడు. సలహా అడిగారు కనుక నిజమే చెప్పమంటారు అందరూ.

కుండ బద్దలుకొట్టినట్లు చెప్తాడు తాను నమ్మే నిజాన్ని.

విమల్ సూటింగ్స్ దాదాపు రెండు కోట్లు (నేడు కాదు, పందొమ్మిది వందల తొంభై దశకంలో) ఖర్చుపెట్టి ఒక రెండు నిమిషాలు వ్యవధి కల యాడ్ ఫిల్మ్ తయారుచేశారు. దాని సృష్టిలో ఆనాటి మేటి మోడల్సు, ఫిల్మ్ డైరెక్టరు, మ్యూజిక్ డైరెక్టరు వగైరాలు భాగస్వాములు. దేశమంతా తిరిగి, భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లోని జీవన రీతులు, నాటి ఫ్యాషన్లను చిత్రీకరించి, ఎంతో శ్రమపడి, ఖర్చుపెట్టి ఈ యాడ్ ఫిల్మ్‌ను తయారుచేశారు.

విఠల్‌కి చూపించారు.

విఠల్ విమల్ బ్రాండ్ ఎడ్వర్‌టైజింగ్ బాధ్యతలను నిర్వహిస్తున్న యాడ్ ఏజెన్సీలో సి.ఒ.ఒ.గా (అంటే ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా, ఆ ఏజెన్సీలో నెంబర్‌టూగా) పనిచేస్తున్నాడు. అంతేకాకుండా ఆ ఏజెన్సీ సృష్టించే ప్రతి ముఖ్యమయిన ప్రకటనను విఠల్‌కు చూపించి, ఆయన అభిప్రాయాలు తీసుకోవటం ఆనవాయితీ.

అలాగే విమల్ రెండు కోట్ల యాడ్‌నీ చూపించారు.

ఏజెన్సీ కాన్ఫరెన్స్ రూమ్‌లో ఆ యాడ్ ఫిల్మ్ సృష్టికర్తలందరూ ముళ్ళమీద కూర్చున్నట్లుగా కూర్చోనున్నారు, విఠల్ ఏమంటాడో అని.

ఫిల్మ్ చూపించారు. ఒకసారి రెండు సార్లు కాదు.. మూడుసార్లు.

ప్రతి ఏజెన్సీలో ఇదో ఆనవాయితీ, కొత్త ఫిల్మ్‌ను మూడుసార్లు చూపించటం. అలాగే ఏజెన్సీలు కూడా తమ క్లయింట్స్‌కి ప్రతి కొత్త యాడ్ ఫిల్మ్‌ను మూడు సార్లు చూపిస్తారు, దాని బాగోగులు గ్రహించేందుకు వీలుగా. సామాన్యంగా యాడ్‌ఫిల్మ్స్ అర నిమిషం, అంటే ముప్పై సెకండ్ల వ్యవధిలో ఉంటాయి. అరనిమిషం ఎంతో చిన్న వ్యవధి కదా! అందుకని వాటి బాగోగులు గ్రహించేందుకు కొత్త యాడ్‌ఫిల్మ్‌ని తొలిసారి చూపిస్తున్నప్పుడు కనీసం మూడు సార్లు చూపించటం.

అందరి ముఖాల్లోని ఆత్రుతను గ్రహించాడు విఠల్.

నిజం చెప్పనా, అబద్ధం చెప్పనా అని ప్రతిసారిలాగే అడిగాడు.

నిజమే చెప్పు మహాప్రభో అన్నారు నరాలు తెగే సస్పెన్స్‌తో ఉన్న అక్కడి వారందరూ, ఏక కంఠంతో.

“ఈ యాడ్‌కి మంచి బాడీ ఉంది కాని, ఆత్మలేదు... కనుక ఇది ఎవ్వరినీ స్పృశించదు... కనుక విఫలమౌతుంది... సారీ...”

నిజం చెప్పటానికి ఎంతోధైర్యం కావాలి. అది పుష్కలంగా ఉన్నవాడు విఠల్.

శాకాహారి.

నామమాత్రంగా డ్రింక్ తీసుకుంటాడు.

ఏజెన్సీ కల్చర్‌కి విరుద్ధంగా సూట్‌లో ఉంటాడు రోజూ. సామాన్యంగా ఏజెన్సీ క్రౌడ్ జీన్స్, టీ షర్ట్సులో ఉంటారు. ఆడా మగా అందరూ.

మన విఠల్ సూట్‌లో ఉంటాడు. చెవులకు దిద్దులో, రింగులో ఏవీ ఉండవు.

జడవేసుకునే పొడుగాటి జుట్టు కూడా ఉండదు.

చక్కని క్రాఫ్.

ఏజెన్సీలలో కొంతమంది వాడే భాష ఇతరులకు పరమ ఛండాలంగా, బూతుల పంచాంగం లాగా ఉంటుంది. విఠల్ అలాంటి భాష వాడడు.

ఏ బ్యాంకరో, ఇంజనీరో, సైంటిస్టో వాడే సాధారణ భాషనే వాడతాడు.

విఠల్ చదువు మనదేశంలోని మెజారిటీ వారిలాగా సామాన్య స్కూల్స్‌లో కాలేజీలలో జరిగింది. కాన్వెంట్ చదువుకాదు, మాతృభాషలో చదువుకున్నాడు.

ఎడ్వర్‌టైజింగ్ ఇండస్ట్రీలోని ఎంతోమందిలాగా ఇంగ్లీషువారి జీవితాన్ని జీవించడు.

ఎంచక్కా హిందీ సినిమాలు ప్రతివారాంతం చూస్తాడు. ఎంజాయ్ చేస్తాడు. అవసరమైతే చప్పట్లు కొడతాడు... ఈలవేస్తాడు...

మనలాగే చేత్తోనే అన్నం తింటాడు. ఫోర్కులు గట్రా వాడడు.

సామాన్య భారతీయుడు మన విఠల్. దేశీ ఎడ్వర్‌టైజింగ్ ప్రొఫెషనల్. విదేశీ సంస్కృతికి, పద్ధతులకు అలవాటు పడ్డ ఇండియన్ ఎడ్వర్‌టైజింగ్ రంగంలో శుద్ధ దేశీయుడు మన విఠల్.

* * *